సాక్షి ప్రకాశం

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



దంచికొట్టి..పొంగి పొర్లి

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.

- IIలో..



రెండు రోజుల్లో విదేశాలకు.. అంతలోనే..

రెండు రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

- IIలో..

గరిష్టం/కనిష్టం 34 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

21 మంది వైఎస్సార్ సీపీ నేతలపై కేసు నమోదు

మార్కాపురం: మండలంలోని రాయవరం వద్ద ఈనెల 19వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో 30 పోలీసు యాక్టు ఉల్లంఘించారని, మైక్ పర్మిషన్ లేకుండా మాట్లాడారని మార్కాపురం రూరల్ పోలీసులు ఇద్దరు ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్, నలుగురు నియోజకవర్గ ఇన్‌చార్జిలతోపాటు మొత్తం 21 మంది వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. సెక్షన్ 189(2), 126(2), 223, 292, ఆర్/డబ్ల్యూ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద రూరల్ ఎస్సై అంకమరావు కేసు నమోదు చేశారు. మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవి, నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, నాగేంద్రారెడ్డి, ఎస్‌కే సలీమ్, మున్నా, కల్యాణ్, పీఏ నారాయణ, ప్రసాద్‌రెడ్డి అలియాస్ బన్నీ, పీసీపల్లికి చెందిన బొర్రారెడ్డి, గొబ్బూరు ఆదినారాయణ, కనిగిరికి చెందిన కస్తూరి రెడ్డి, ఒంగోలుకు చెందిన కటారి శంకర్, కొనకనమిట్లకు చెందిన మెట్టు వెంకటరెడ్డి, రాయవరానికి చెందిన మల్లయ్యతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు.

నేడు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

- పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు

ఒంగోలు సిటీ: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు సోమవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ బంద్‌లో అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు, యాజమాన్యాలు, అసోసియేషన్ లు తప్పకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనబడలేదా అని ప్రశ్నించారు. మరొకవైపు ప్రభుత్వం 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' సభల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులు చెల్లించడంలో సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలు చెల్లించాలని, లేదంటే రాబోయే రోజుల్లో విద్యార్థులతో కలుపుకొని, అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

పశ్చిమంపై శీతకన్ను!

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గత ప్రభుత్వంలో వడివడిగా సాగిన మెడికల్ కాలేజీ, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాలు కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోగా.. మరే ఇతర అభివృద్ధి పనుల ఊసే లేకుండా పోయింది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామన్న హామీ కూడా నీటిమూటగానే మిగిలిపోయింది. పశ్చిమ ప్రకాశంపై కూటమి ప్రభుత్వ వివక్షపై జనం మండిపడుతున్నారు.

- పశ్చిమం అభివృద్ధిపై ఇంత నిర్లక్ష్యమా !
- 15 నెలలు కావస్తున్నా ఒక్క అభివృద్ధి కార్యక్రమం లేదు
- వెలుగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులు
- ఏర్పాటుకాని మార్కాపురం జిల్లా
- హామీలకే పరిమితమైన అభివృద్ధి పనులు ఏర్పాటు



వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్ (ఫైల్)

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు కావస్తున్నా జిల్లాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో ఒక్క అభివృద్ధి పనికూడా జరగలేదు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఎన్నికల హామీలు ఇంతవరకూ అమలుకాలేదు. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను కూడా నిలిపివేయడంపై ప్రజల్లో కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ, మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టు పనులు, మార్కాపురం పట్టణంలో షాదీఖానా నిర్మాణం, బీసీ భవన్, పొదిలి పెద్దచెరువు తదితర పనులన్నీ ఆగిపోయాయి. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపడతామని ప్రకటించడంపై ఈ ప్రాంత ప్రజల్లో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక వెలుగొండ ప్రాజెక్టుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇలా కీలకమైన అభివృద్ధి పనులన్నీ నిలిచిపోగా కొన్ని మాత్రం నత్తనడకతో పోటీపడుతున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో ? ఎప్పుడు ప్రారంభమవుతాయో ఎవరూ చెప్పలేక పోతున్నారు. మార్కాపురం, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు టీడీపీ ఎమ్మెల్యేలను గెలిపించారు. ఇక జిల్లా ఏర్పాటుపై అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటనలు అయితే ఇస్తున్నారు కానీ కార్యరూపం దాల్చడంలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి ప్రొఫెసర్లను నియమించారు. పెద్దదోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంజూరు చేశారు. పొదిలి పెద్దచెరువు నిర్మాణానికి రూ.50 కోట్లు ఇచ్చారు.

మెడికల్ కళాశాల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిపోయింది. జిల్లా వైద్యశాల నుంచి జీజీహెచ్‌గా మారి అత్యున్నతమైన కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా పేద ప్రజలకు అందించే హాస్పిటల్‌కు నేడు రోగులు కరువయ్యారు. కూటమి ప్రభుత్వం రాగానే మెడికల్ కాలేజీని అర్ధాంతరంగా ఆపడంతో పాటు పీపీపీ విధానంలో చేస్తామంటూ చేసిన ప్రకటన కూడా వాస్తవరూపం దాల్చలేదు.



మార్కాపురం పట్టణం వ్యూ

జిల్లా ఏర్పాటు ప్రకటనలకే పరిమితం:

గత ఎన్నికలకు ముందు మార్కాపురాన్ని జిల్లాగా చేసి సీఎంగా మార్కాపురం వస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు హామీ నెరవేర్చకుండానే మార్చి 8న మార్కాపురంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి హాజరయ్యారు. అప్పుడు కూడా ప్రజలు అడిగిన ప్రశ్నలకు కచ్చితంగా జిల్లా చేస్తానని హామీ ఇచ్చాడు కానీ ఎప్పట్లోగా చేస్తానని మాత్రం ప్రకటించలేదు. ఇటీవల కాలంలో జిల్లా ఏర్పాటుపై ప్రకటనలు మాత్రం అధికారపార్టీల నుంచి వస్తున్నాయే తప్ప ఆచరణలో కనిపించడం లేదు. మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పాటైతే జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. 4 నియోజకవర్గాల్లోని 20 మండలాలకు చెందిన 10 లక్షల మంది ప్రజల అభివృద్ధికి జిల్లా ఏర్పాటు ఉపయోగపడుతుంది. క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులను అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తారు. కేంద్రం నుంచి వెనుకబడిన జిల్లాల ప్రత్యేక నిధులు వస్తాయి. కలెక్టర్, ఎస్పీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, జేడీలు, వైద్యశాఖ డీఎంహెచ్‌ఓ, ఇతర సంక్షేమశాఖల ఈడీలు ఇక్కడే ఉండి అభివృద్ధిని పర్యవేక్షించే అవకాశం ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా మార్కాపురానికి వస్తుంది.

వెలుగొండ ఎప్పటికి పూర్తవుతుందో ?

నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడు తాను అధికారంలోకి రాగానే వెలుగొండను పూర్తిచేస్తానని చెప్పి బడ్జెట్‌లో రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ఏమాత్రం సరిపోవు. ముంపు గ్రామాల ప్రజల ఆర్‌ఆర్ ప్యాకేజీల కోసం కనీసం రూ.1200 కోట్లు కేటాయించాలి. ప్రభుత్వం కేటాయించిన నిధులు సిబ్బంది జీతభత్యాలకు, అరకొర పనులకు మాత్రమే ఉపయోగపడతాయి. మరోవైపు ప్రాజెక్టును 2026కు పూర్తిచేస్తామని చెబుతున్నా నిధుల కేటాయింపు జరగకపోవడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇలా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

మెడికల్ కాలేజీని, వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి



మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. అప్పుడే పేద ప్రజలకు ఉపయోగపడుతుంది. ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో శాశ్వతంగా కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేయాలి. అప్పుడే ఈ ప్రాంతంలో కరువు పోతుంది. ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. పునరావాస కాలనీల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి. వెలుగొండ నీటిని ప్రతి ఇంటికి అందించాలి. బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయించాలి.

– బీ బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ నేత

జిల్లాను త్వరగా ఏర్పాటు చేయాలి



మార్కాపురం కేంద్రంగా త్వరగా జిల్లాను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పెద్దలు ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలి. నాడు ప్రతిపక్ష నాయకులుగా ప్రస్తుత కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో మార్కాపురం వచ్చినప్పుడు మార్కాపురం జిల్లా చేస్తామని చెప్పారు. కార్యరూపం దాల్చి నిర్ణీత సమయాన్ని ప్రకటించి త్వరగా జిల్లా ఏర్పాటు చేస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం పుల్లలచెరువు నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లాలంటే సుమారు 160 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, గిద్దలూరు, అర్ధవీడు, దోర్నాల మండలాల ప్రజలు వివిధ పనుల కోసం ఒంగోలుకు వెళ్లాలంటే చాలా అవస్థలు పడుతున్నారు.

– డీ సోమయ్య, సీపీఎం జిల్లా నాయకులు



నిర్మాణం నిలిచిపోయిన మెడికల్ కాలేజీ (ఫైల్)

నేటి నుంచి దసరా నవరాత్రులు



త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి ఆలయం



త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం

- త్రిపురాంతకంలో అక్టోబర్ 2 వరకు ప్రత్యేక అలంకారాలు
- ప్రతిరోజు వాహన సేవలు

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకంలో బాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక నవరాత్రి పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించనున్నారు. నేటి నుంచి వచ్చే నెల 2వ తేదీ గురువారం వరకు దసరా నవరాత్రులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం మంగళ వాయిద్యాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారికి అభిషేకం, కాలపూజ, బాలభోగం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్వికరణం, పంచగవ్యప్రాసన, అఖండ స్థాపన, మండపారాధన, అష్టదిక్పాలకులకు పూజ, సప్తశతీపారాయణం, చండీహోమం ప్రత్యేక పూజలను వేదపండితులు నిర్వహించనున్నారు. ప్రతిరోజు దంపతులచే కుంకుమార్చనలు, ఉభయ దాతల పూజలు, గోపూజ, బాలపూజ, మహానివేదన, ఉభయదాతల ఆశీర్వచనం, ప్రత్యేక పూజలు భక్తులచే నిర్వహించనున్నారు. 22 సోమవారం నవరాత్రి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అదే విధంగా 29 సప్తమి మూలా నక్షత్రం రోజున సరస్వతీదేవి పూజ, అక్షరాభ్యాసాలు, 30న దుర్గాష్టమి, మహర్నవమి ప్రత్యేక పూజలు, అక్టోబర్ 1వ తేదీ బుధవారం మహర్నవమి రోజున సుహాసిని పూజ, దంపతుల పూజలు, 2వ తేదీ గురువారం విజయదశమి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి సందర్భంగా కుంభం, బలిహరణ, కూష్మాండదుర్గ, కలశ ఉద్వాసన సంప్రోక్షణ, భక్తులకు ఆశీర్వచనం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



పార్వతి అమ్మవారి మూలవిరాట్



శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

ప్రతిరోజు ప్రత్యేక అలంకారం.. వాహన సేవలు:

- 22 సోమవారం బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం పల్లకీసేవ, రాత్రి పద్మవాహనంపై అమ్మవారు ఉత్సవం నిర్వహించనున్నారు.
- 23వ తేదీ బ్రహ్మచారిణి అలంకారంలో హంసవాహన సేవ, 24న చంద్రఘంట వ్యాఘ్ర వాహనసేవ, 25న కూష్మాండదుర్గ అలంకారంలో శేషవాహన సేవ, 26న శైలిపుత్రి అలంకారంలో వాహనసేవ, 27న స్కందమాత అలంకారంలో మయూర వాహనసేవ, 28న కాత్యాయని అలంకారంలో సింహ వాహనసేవ, 29న కాళరాత్రి అలంకారంలో గజ వాహన సేవ, 30న మహాదుర్గ అలంకారంలో నంది వాహన సేవ, అక్టోబర్ 1న సిద్ధిదాయిని అలంకారంలో అశ్వవాహన సేవ, 2న రాజరాజేశ్వరి దేవి అలంకారంలో గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయం వద్ద శమీ పూజ, పారువేట కార్యక్రమం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళా సాధికారత చేతల్లో చూపాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

పొదిలి: మహిళా సాధికారిత గురించి పాలకులు మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా ఉపాధ్యాయ జిల్లా చైతన్య సదస్సు నిర్వహించారు. సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ జండాను డి.గురవమ్మ, యూటీఎఫ్ జండాను రాజసులోచన, ఉమామహేశ్వరి ఆవిష్కరించి జండా వందనం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ కార్యకర్తలు పాఠశాలల్లో కుల, మత, ప్రాంత, లింగ బేధం చూడకుండా బోధించాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి పదిహేను నెలలు గడుస్తోందని ఉపాధ్యాయులకు నెల నెలా జీతం తప్ప ఏమీ ఇవ్వటం లేదన్నారు. 11వ పీఆర్‌సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు మంజూరు చేయలేదన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్మును, రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు మొత్తం రూ.30 వేల కోట్లు ఉన్నాయన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువగా ఉన్నాయని, దీంతో బడులకు వచ్చే బడుగు, బలహీన వర్గాల పిల్లలకు బోధించే అవకాశం లేకుండా చేస్తున్నారన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా, తాలూకా నాయకులు అబ్దుల్‌హై, బాల వెంకటేశ్వర్లు, ఎస్.రవి, ఐవీ.రామిరెడ్డి, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన



రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు



ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు

- ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సమరశీల పోరాటం
- రాష్ట్ర మహా సభలో ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు

ఒంగోలు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు అంగన్‌వాడీలు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆదివారం ఒంగోలు కొత్త మార్కెట్ సెంటర్ వద్ద రాష్ట్ర అధ్యక్షురాలు జీ బేబి రాణి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు మాట్లాడుతూ దేశంలో 80 శాతం ప్రజలకు పోషకాహారం అందడం లేదన్నారు. 70 శాతం మంది మహిళలు రక్తహీనతతో ఉన్నారని, దేశంలో ప్రతి రోజూ పౌష్టికాహార లోపంతో వేలాది మంది పసికందులు మృత్యువాత పడుతున్నారన్నారు. గౌరవ వేతనంతోనే పేదలకు పోషకాహారం అందిస్తూ సామాజిక బాధ్యతగా సేవ చేస్తున్న అంగన్‌వాడీలకు కనీస వేతనంతో పాటు తగిన గౌరవం దక్కాలంటే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాల అమలులో ఒక్కో రాష్ట్రం ఒక తీరుగా చెల్లిస్తున్నారని, గుజరాత్‌లో కార్యకర్తలు రూ.24,800, హెల్పర్లకు రూ.20 వేల వేతనాన్ని కోర్టు ద్వారా సాధించిన వైనాన్ని గుర్తు చేశారు. ప్రతి వ్యక్తికి పోషకాహారం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు కల్పించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌లో, మిడ్ డే మీల్ లో, రేషన్‌లో కోత విధిస్తున్నట్లు దుయ్యబట్టారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ నెలలో కేంద్ర మంత్రుల నివాసాల వద్ద పది రోజులు పాటు ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎస్మా వంటి నిర్బంధాలు ఎదిరించి ఎన్నో విజయాలు సాధించిన ఉద్యమ స్ఫూర్తితో అంగన్‌వాడీలు స్కీమ్ వర్కర్స్, ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఘటన స్థలంలో అచ్చారావు మృతదేహం

దర్శి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన దర్శి మండలంలోని రాజంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దొనకొండ మండలం భూమనపల్లికి చెందిన అచ్చారావు (32) అనే యువకుడు మోటారు సైకిల్‌పై పొదిలి నుంచి సంఘం డెయిరీ వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన మరో మోటారు సైకిల్ ఢీకొని అచ్చారావు కిందపడిపోయాడు. రోడ్డుకు తల బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108కు ఫోన్ చేయగా, వారు వచ్చి పరిశీలించి అచ్చారావు మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాటంవారిపల్లెలో కొండచిలువ కలకలం


కొండచిలువను పట్టుకుని వెళుతున్న గ్రామస్తుడు

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లె గ్రామంలో కొండచిలువ ఆదివారం కలకలం రేపింది. రైతుల వామి దొడ్లలోని గడ్డి వాముల వద్ద కొండచిలువ కనిపించటంతో పిల్లలు కేకలు వేశారు. సుమారు 12 అడుగుల పొడవున్న దానిని గమనించిన గ్రామస్తులు గ్రామానికి చెందిన యోగయ్య ను పిలిపించి కొండచిలువను పట్టించి దగ్గరలోని అడవిలో వదిలేశారు.

ఎయిడెడ్ పాఠశాలలకు కిట్లు ఇవ్వాలి

ఒంగోలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చినట్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎల్ కిట్లు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు సీహెచ్ ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 765 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో ప్రకాశం జిల్లాలో 135 ఎయిడెడ్ పాఠశాలలకు నవంబర్ 10వ తేదీలోపు కిట్లు సరఫరా చేయాలని కోరారు. లేకుంటే నవంబర్ 14న బాలల దినోత్సవం రోజు ప్రకాశం జిల్లా శాఖ సర్వశిక్షా అభియాన్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు.


కొండపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద సగిలేరువాగు


దర్శి: ఆర్టీసీ బస్టాండ్ ముందు భారీగా నిలిచిన వర్షం నీరు


యర్రబాలెం బ్రిడ్జిపై నుంచి పారుతున్న గుండ్లకమ్మ వాగు


ఎల్లయ్య నగర్ వద్ద ఒంగోలు కర్నూలు రహదారిపై పారుతున్న వర్షం నీరు

దంచికొట్టి.. పొంగిపొర్లి

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- ఉదయం ఎండ..సాయంత్రం వర్షం
- నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- పశ్చిమ ప్రకాశంలో అధిక వర్షపాతం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం భానుడు ఉగ్రరూపం దాలుస్తుండగా సాయంత్రానికల్లా ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తోంది. జిల్లాలో నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

తాళ్లూరు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దోసకాయలపాడు, విఠలాపురం, మల్కాపురం, తాళ్లూరు గ్రామాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విఠలాపురం–తాళ్లూరు బ్రిడ్జిపై నీళ్లు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే దోసకాయల పాడు–తోట వెంగన్నపాలెం గ్రామంలోని బ్రిడ్జిపై వర్షం నీరు ప్రవహించడంతో పాటు రోడ్లు కోతకు గురవడంతో గ్రామస్తుల రాకపోకలు నిలిచిపోయాయి.

గుండ్లకమ్మ పరవళ్లు..

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో గుండ్లకమ్మవాగు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. చోళ్లవీడు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద గుండ్లకమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అకవీడు, చోళ్లవీడు, చినగానిపల్లె పంచాయతీల్లోని తురకవానిచెరువు, దొడ్డేని చెరువు, రంగయ్యనాయుడు చెరువులకు గుండ్లకమ్మ వరద నీటితో కళకళలాడుతున్నాయి, చినగానిపల్లెలో రంగయ్యనాయుడు చెరువు అలుగు పారుతుండటంతో పంటకాలువలు, సైడుకాలువలు మరమ్మతులకు గురికావడంతో గ్రామం నుంచి మోకాలి లోతులో నీరు ప్రవహిస్తున్నాయి.

అర్ధవీడు: నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని జంపలేరు వాగు పొంగడంతో పాపినేనిపల్లె నుంచి బొల్లుపల్లి, అచ్చెంపేట గ్రామాలకు వాహనరాకపోకలు స్తంభించాయి. దీంతో కంభం, గిద్దలూరు, ఒంగోలు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి వాగు ప్రవాహం తగ్గడంతో రాకపోకలు కొనసాగాయి.

దర్శి పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోయింది. బస్టాండ్ ఆవరణలో భారీగా నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక వెలవారి బజారులో భారీగా వర్షం నీరు నిలిచి ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కంభం చెరువుకు జలకళ

కంభం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా పారుతుండటంతో కంభం చెరువుకు వరదనీరు వచ్చి చేరుతోంది. తురిమెళ్ల వద్ద వాగు ఉధృతంగా పారుతోంది. యర్రబాలెం వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి వాగు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం నుంచి వాగు ఉధృతిగా ఎక్కువగా ఉంది. ఇప్పటికే కంభం చెరువులో సుమారు 9 అడుగుల మేర నీరు ఉండగా గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా కంభం చెరువు వైపుకు పారుతుండటంతో చెరువు నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కంభం చెరువుకు నీరు చేరుతుండటంతో ప్రజలు భారీగా తరలివచ్చి తిలకిస్తున్నారు.

ముండ్లమూరు(దర్శి): ముండ్లమూరులో వేంపాడు వద్ద చిలకలేరు, ఈదరవాగు, వేములవాగు పొంగి పొర్లుతున్నాయి. వాగు ఉధృతితో రాకపోకలకు అంతరాయం కలిగింది.

చీమకుర్తి రూరల్: మండలంలో మర్రిచెట్లపాలెంలో ఆదివారం సాయంత్రం గంటకుపైగా భారీ వర్షం కురిసింది. ఎల్లయ్య నగర్ నుంచి మర్రిచెట్లపాలెం వరకు రహదారిపై నీళ్లు పారుతూ జలమయమై ఒంగోలు – కర్నూలు రహదారి సాగర్ కాలువలను తలపించాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


విఠలాపురం-తాళ్లూరు బ్రిడ్జిపై పొంగిపొర్లుతున్న వర్షంనీరు

ఉప్పొంగిన సగిలేరు వాగు

గిద్దలూరు రూరల్: గత శనివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా మండలంలోని సగిలేరు వాగు ఉప్పొంగింది. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో దిగువమెట్ట గ్రామ సమీపంలో సగిలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ప్రతాప్‌రెడ్డి కాలనీకి వెళ్లే రోడ్డు వాగు పొంగడంతో రోడ్డు నీటమునిగింది. స్థానికులు వాగు దాటకుండా పోలీసులు అప్రమత్తం చేశారు. కొండపేట సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం మీదుగా సగిలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో జగనన్న కాలనీకి వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయం నుంచి ఆదివారం 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ ఏఈ రామాంజనేయులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రెండు రోజులుగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నాలుగు గేట్లను 0.5 అడుగులు ఎత్తి పది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లోకి 7 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో 24 మీటర్ల వద్ద నీటిని నిలుపుదల చేస్తున్నారు. అదనంగా వస్తున్న నీటిని గుండ్లకమ్మ నదిలోకి విడుదల చేస్తున్నారు. పైనుంచి వచ్చే వరద నీటినిబట్టి కిందకు నీటి విడుదల పరిమాణాన్ని పెంచడం, తగ్గించడం చేస్తామని ఏఈ తెలిపారు.


గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం


చోళ్లవీడులో బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ


దర్శి: వెలమవారి బజారులోకి వచ్చిన వర్షం నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న వేముల వాగు


తురిమెళ్ల వద్ద ఉధృతంగా పారుతున్న గుండ్లకమ్మ వాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరు వాగు


తోటవెంగన్నపాలెం బ్రిడ్జి వద్ద కోతకు గురైన రోడ్డు


కంభం చెరువులో చేరుతున్న వరదనీరు

గురజాడ, బోయి భీమన్నకు ఘన నివాళులు


గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జయప్రకాష్


గురజాడ, భీమన్నల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కళామిత్రమండలి సభ్యులు

ఒంగోలు మెట్రో:

స్థానిక మంగమూరు రోడ్డులోని శివాజీ నగర్ రెండో వీధిలో ఉన్న రాజ్యలక్ష్మి నిలయంలో కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి, బోయి భీమన్న 114 జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు డా.నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. జాతీయ భావాలను గుండె నిండా నింపుకున్న నవ్యమార్గ నిర్దేశకులు, సాంఘిక దురాచారాలు, కులవ్యవస్థను చీల్చిచెండాడుతూ మానవతా వాదానికి పెద్దపీట వేసిన దార్శనికులు గురజాడ, బోయి భీమన్న అని కొనియాడారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ప్రసంగిస్తూ కాలంతో పాటు కదులుతూ జీవితాన్ని, సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ భాషలోనూ, భావంలోనూ విప్లవాన్ని తమ రచనల్లో ప్రతిపాదించిన గొప్ప సంఘసంస్కర్తలు, ఆధునిక సాహిత్య భాస్కరులు గురజాడ, బోయి భీమన్న అని అన్నారు. ముత్యాల సరాల సృష్టికర్త, కొత్త జాడల వెలుగు జాడ గురజాడ అని శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, జంగం రాజశేఖర్, తేళ్ల అరుణ, యు.వి.రత్నం, కేఎస్వీ ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ, బీరం అరుణ, నాళం నరసమ్మ తదితరులు పాల్గొని గురజాడ, బోయి భీమన్నలకు నివాళులర్పించారు.

గొప్ప సంఘ సంస్కర్త గురజాడ
జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయప్రకాష్

ఒంగోలు సిటీ: కన్యాశుల్కం, బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను మహాకవి గురజాడ అప్పారావు తీవ్రంగా వ్యతిరేకించారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ జయప్రకాష్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాయిరాం బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం గురజాడ 164వ జయంతి ఉత్సవం నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ ‘మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును’ అని ప్రకటించిన సత్యశోధకుడు గురజాడ అన్నారు. గురజాడ రాసిన దేశభక్తి కవిత అర్థవంతమైందనీ, నేటి పరిస్థితులకు చక్కగా సరిపోతుందని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ గేయాన్ని చదివి అర్థం చేసుకోవాలని కోరారు. మహాకవి గురజాడ జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. జేవీవీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌టీ వెంకటేష్ మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో దేశభక్తి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 12న పోటీలు నిర్వహించి విజేతయలకు బహుమతులు అందజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రాఘవ, సీనియర్ లెక్చరర్స్ ఫణీంద్ర, అంజిరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకల్ విద్యాలయాలతో విద్యార్థుల్లో దేశభక్తి


శిక్షణలో ఏకల్ విద్యాలయాల కో ఆర్డినేటర్లు, సంస్థ అధికారులు

త్రిపురాంతకం: ఏకల్ అభియాన్ విద్యాలయాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందిస్తున్నట్లు ఏకల్ విద్యాలయాల జిల్లా అధ్యక్షుడు డీ రాములు పేర్కొన్నారు. త్రిపురాంతకంలో ఏకల్ అభియాన్ విద్యాలయాల రాయలసీమ జిల్లాల కో ఆర్డినేటర్ల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకల్ విద్యాలయాలు దేశవ్యాప్తంగా 95 వేల గ్రామాల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రెండు లక్షల గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా విద్యార్థుల్లో విద్యతో పాటు, దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు, కుటుంబ విలువలు వంటి వాటిపై చిన్ననాటి నుంచి శిక్షణ ఇస్తారని చెప్పారు. రాయలసీమ జిల్లాలకు చెందిన 60 మంది వారం రోజుల పాటు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీపీ కృష్ణారావు, ఇన్‌చార్జి ఎం హనుమంతు, రాయలసీమ ఇన్‌చార్జి మల్లికార్జున్, ప్రకాశం జిల్లా ఇన్‌చార్జిలు వెంకటేశ్వర్లు నాయక్, సూర్యనారాయణ, సుబ్బారావు, హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిపురాంతకంలో శోభాయాత్ర నిర్వహించారు.

రెండు రోజుల్లో విదేశాలకు..అంతలోనే

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి
- తాత మరణంతో నెల రోజుల క్రితం స్వదేశానికి


ముక్కు సుధీర్‌రెడ్డి(34)

కనిగిరిరూరల్: రెండు రోజుల్లో ఆస్ట్రేలియాకు బయల్దేరాల్సిన యువకుడు.. మృత్యువడికి చేరిన దుర్ఘటన కనిగిరిలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన ముక్కు సుధీర్‌రెడ్డి(34) ఆస్ట్రేలియాలో పదేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల సుధీర్‌రెడ్డి తాత దేవిరెడ్డి వెలుగొండారెడ్డి మృతి చెందడంతో కనిగిరికి వచ్చి నెల రోజులుగా ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లి తిరిగి బైక్‌పై కనిగిరి పట్టణంలోకి వస్తుండగా పామూరు రోడ్డులోని కొత్తూరు సమీపంలోని మిల్లు దగ్గర కుక్క అడ్డం రావడంతో తప్పించే క్రమంలో బైక్ పైనుంచి జారి కింద పడ్డాడు. ప్రమాదంలో సుధీర్‌రెడ్డికి తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. క్షతగాత్రుని వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సుధీర్ రెడ్డి(34), విశ్రాంత టీచర్ ముక్కు నాసరెడ్డి, లలిత కుమారి(టీచర్) దంపతుల పెద్ద కుమారుడు. వీరి స్వగ్రామం హనుమంతునిపాడు మండలం తాటిచెట్లవారిపల్లి. సుమారు 30 ఏళ్ల నుంచి కనిగిరిలో నివాసముంటున్నారు.


భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, నేతలు

సుధీర్‌రెడ్డి భౌతికకాయానికి దద్దాల నివాళి..

బైక్ ప్రమాదంలో మృతి చెందిన ముక్కు సుధీర్ రెడ్డి భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం రాత్రి సందర్శించి, నివాళులర్పించారు. ఘటన వివరాలు తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, గాయం ఈశ్వరమ్మ, పులి శ్రీను, యక్కంటి శ్రీను, సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, గుంటక వెంకట రమణారెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణ రెడ్డి, సైకం ఏడుకొండలరెడ్డి ఉన్నారు.